క్లుప్తంగా

స్వచ్ఛభారత్‌లో యువత



ముళ్లచెట్లను తొలగిస్తున్న యువకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణు గోపాలపురం, కల్లివెట్టు గ్రామాలకు కేటీ రోడ్డు ఇరువైపుల ఉన్న ముళ్లచెట్లను ఆదివారం యువకులు తొలగించారు. యువత మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ విధిగా పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కీర్తన

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ హాస్పిటల్ తిరుపతి వారి సహకారంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 170 మందికి వైద్యురాలు కీర్తన వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ట్రస్టు ఎండీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామ్‌నాయుడు తెలిపారు. 75 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేయగా, 40 మందికి ఉచిత కంటి అద్దాలు, 30 మందికి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయలో ఉచితంగా కంటికి ఆపరేషన్ చేస్తామని తెలిపారు. భోజనం, రవాణా, మందులను ఉచితంగా అందజేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కృష్ణ తెలిపారు. వైద్య సిబ్బంది, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో యూపీ ముఖ్యమంత్రి సీఎస్



ధ్వజస్తంభం వద్ద సంజయ్ సింగ్ కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి సంజయ్ సింగ్ ఆదివారం శ్రీకాళహస్తీశ్వర, జ్ఞానప్రసూనాంబిక అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం మృత్యుంజయ లింగం వద్ద వేద పండితులచే ఆశీర్వాదం చేయించి తీర్థప్రసాదాలను అమ్మవారి పట్టు వస్త్రాలను, చిత్రపటాన్ని బహూకరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో జిల్లా అధికారి చంద్రశేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ: మన హాస్టల్, ఇంటితోపాటు, గ్రామాన్ని, మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని అంటు వ్యాధులు సోకకుండా చూసుకోవాలని తిరుపతి జిల్లా బీసీ సంక్షేమాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ హాస్టల్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డన్ రామయ్య, విద్యార్థులతో కలసి హాస్టల్ పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యాక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రతిరోజూ హాస్టల్‌లోని విద్యార్థులు గంటపాటు పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. మొక్కలను నాటి పర్యావరణ పరిపరక్షణ చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది హైమావతి, చెంగయ్య, పాల్గొన్నారు.

ఆలయంలో బదిలీలు

శ్రీకాళహస్తి: ఆలయంలో ఆదివారం విడుదల చేసిన బదిలీల జాబితాలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ కడప దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బుగ్గమఠం అసిస్టెంట్ కమిషనర్ కస్తూరి నియమితులయ్యారు. ఇంజినీరింగ్‌శాఖ ఈఈగా శ్రీకాళహస్తిలో విధులు నిర్వర్తిస్తున్న నూకారత్నం ద్వారకా తిరుమలకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో శ్రీశైలం ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న మురళీధర్‌రెడ్డి శ్రీకాళహస్తి ఆలయ ఇంజనీరింగ్‌శాఖ ఈఈగా నియమితులయ్యారు.

ఫీల్డ్‌లో ఖాళీ!

నిరుపేదలకు ఉపాధి కల్పన కోసం 100 రోజులతో పాటు ఒక్కో జాబ్ హోల్డర్‌కు పనులు కల్పించాల్సిన ఉపాధి హామీ పథకానికి సిబ్బంది కొరత ఇబ్బందిగా మారింది. గతంలో నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కారణాలతో కొందరిని తొలగించగా మరికొందరు అవినీతి పనులతో సస్పెండ్‌కు గురయ్యారు. దీంతో గడిచిన ఐదేళ్లుగా ఖాళీ ఏర్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆ గ్రామాల్లో పనులు పూర్తిగా జరగడం లేదు. మరికొన్ని చోట్ల మాత్రం సీనియర్ మేట్లతో తాత్కాలికంగా పనులు చేపడుతున్నారు. సీనియర్ మేట్ల విధానంతో సకాలంలో బిల్లులు కూడా కూలీలకు అందని వైనం. ఓ వైపు జిల్లా కలెక్టర్ రోజువారీ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి కూలీల సంఖ్య పెంచాలంటూ పదేపదే ఒత్తిడి తెస్తున్నా క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేయాల్సిన సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలన్న విషయాన్ని గుర్తించకపోవడం గమనార్హం.

- ఉపాధికి సిబ్బంది లేక ఇబ్బంది
- 35 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీ
- మందకొడిగా సాగుతున్న ఉపాధి పనులు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకానికి సిబ్బంది కొరత కారణంగా పనుల్లో జాప్యం కలుగుతోంది. ఆమేరకు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు ఏడు మండలాల్లో 35 గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో కూలీలకు పనుల కల్పన ఆలస్యమవుతోంది. నియోజకవర్గ పరిధిలో 51,694 జాబ్ కార్డులు ఉండగా వీటి ద్వారా 33,173 మంది కూలీలు ఉన్నారు. వీరిలో ప్రతి ఏడాది ఉపాధి ద్వారా 100 రోజుల పనిదినాలు సద్వినియోగం చేసుకునే కూలీలు 6వేల మంది ఉన్నారు. అయితే 35 గ్రామ పంచాయతీల్లో ఉపాధి సిబ్బంది లేకపోవడంతో కూలీలు ఇబ్బందిపడుతున్నారు.

ఊసేలేని నియామకాలు:

నియోజకవర్గవ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం ఊసే లేకుండాపోయింది. గత ఏడాది నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో నియామకం కోసం ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు సూచించారు. అయితే నియామకాలు కోసం స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

లక్ష్యం చేరక..

నియోజకవర్గంలోని ఒక్క కేవీబీపురం మండలంలో 13 మంది ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల ఖాళీలు ఉన్నాయి. వీరిలో ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలగించిన వారు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని నేరవేర్చకపోవడంలో వెనుకడుగు, కొన్నిచోట్ల అవినీతి పనులు చేపట్టిన కారణంగా పలువురిని తొలగించారు. అలాగే వరదయ్యపాళెం మండలంలో కూడా ఆరు పంచాయతీల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



కారిపాకంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలాల వారీగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత, కూలీల వివరాలు

మండలం	ఫీల్డ్ అసిస్టెంట్ల ఖాళీలు	జాబ్ కార్డులు	కూలీలు
వరదయ్యపాళెం	06	7305	5707
బీఎన్‌కండ్రిగ	01	7690	1200
కేవీబీపురం	13	9224	2200
నారాయణవనం	05	7424	1613
పిచ్చాటూరు	05	6207	10750
నాగలాపురం	04	5969	9551
సత్యవేడు	01	7875	2152

ప్రతిపాదనలు పంపాం



ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్న గ్రామాల్లో టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి పనులు వేగవంతం చేస్తాం.

– గణేష్, ఏపీఓ, వరదయ్యపాళెం మండలం

పనులు కల్పించండి



ఉపాధి హామీ ద్వారా వెంటనే పనులు కల్పించాలి. గడిచిన మూడు సంవత్సరాలుగా తమ పంచాయతీలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం జరగలేదు. అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మూడేళ్లుగా తమ పంచాయతీలో పనులు జరగక ఉపాధి కూలీలు పస్తులతో అలమటిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి పనులు జరిగేలా చూడాలి.

– సునీల్, ఇందిరానగర్, వరదయ్యపాళెం మండలం

ప్రారంభానికి బస్ షెల్టర్ సిద్ధం

- తిరుపతి ఎంపీ గురుమూర్తి నిధులతో నిర్మాణం



నిర్మాణం పూర్తయిన బస్‌షెల్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పీవీ కండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం ఎస్టీ కాలనీ క్రాస్ వద్ద ఎంపీ నిధులతో నిర్మిస్తున్న బస్‌షెల్టర్ నిర్మాణం పూర్తయ్యింది. బస్‌షెల్టర్ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తికి విన్నవించారు. స్పందించిన ఎంపీ బస్‌షెల్టర్ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు శరవేగంగా జరిగి ప్రారంభానికి సిద్ధమైంది. దీంతో ఎన్నో సంవత్సరాలుగా గ్రామస్తులు ఎదురుచూస్తున్న బస్‌షెల్టర్ నిర్మాణం పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తిరుపతి ఎంపీ గురుమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ జన్మదిన వారోత్సవాలు

శ్రీకాళహస్తి : దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు పేదలకు న్యూట్రీషన్ ఫుడ్ పంపిణీ చేశారు. తొట్టంబేడు మండలం పెద్దగుంట అగ్రహారంలో పేదలకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ శ్రీ కోలా ఆనంద్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ పార్టీ కో- కన్వీనర్ మేశాగారం సుబ్రమణ్యంరెడ్డి, మండల అధ్యక్షుడు వేదం కృష్ణయ్య, గాలి మురళీ నాయుడు పాల్గొన్నారు.

మీ భద్రత మీ చేతుల్లోనే..



పోలీసులకు భద్రతా ఉపకరణాలు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

శ్రీకాళహస్తి : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ఆనందంగా జీవించాలని ప్రతి ఒక్కరి భవిష్యత్తు భద్రత మీ చేతుల్లోనే ఉంటుందని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని పెళ్లి మండపం వద్ద యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోడ పత్రిక , కరపత్రం ఆవిష్కరించారు. డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కరపత్రంలో రోడ్డు భద్రత నియమాలు పాటించకుంటే జరిగే అనర్థాలపై వివరాలు ప్రచురించినట్లు చెప్పారు. అనంతరం యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ అసోసియేషన్ పోలీసుల్లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి హెల్మెట్లు, రేడియం జాకెట్స్, కంటి అద్దాలు, రెయిన్ కోట్స్ అందించినట్లు పేర్కొన్నారు. యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ అసోసియేషన్‌ను డీఎస్పీ నరసింహమూర్తి అభినందించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ప్రార్థనలో మత పెద్దలు, ముస్లింలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పరిధి తిరుపతి–శ్రీకాళహస్తి జాతీయ రహదారి పక్కన ఉన్న హజరత్ మౌలాలి దర్గా వద్ద సయ్యద్ అరీఫుల్లా ఆధ్వర్యంలో ఆదివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదిన నెల చివరి రోజును పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. మతపెద్ద జనాబ్ మీర్జావలి ప్రవక్త జీవితం, మానవాళికి అందించిన సమాజ ధర్మం తదితరాలను వివరించారు. దర్గా వద్ద మతపెద్దలు, ముస్లింలు ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు జాకీర్ హుస్సేన్, అవేజ్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి



నారాయణస్వామిని సన్మానిస్తున్న వేణుగోపాల్ రెడ్డి, వీవీ సుబ్బారావు

శ్రీకాళహస్తి : ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి అన్నారు. శ్రీకాళహస్తి బ్రాంచ్ ఎల్ఐసీ ఏజెన్సీ యూనియన్ 18వ సర్వసభ్య సమావేశం ఆదివారం మహేష్ కల్యాణ్‌సదన్‌లో నిర్వహించారు. సమావేశంలో జోనల్ ప్రెసిడెంట్ కె.వేణుగోపాల్ రెడ్డి డివిజనల్ ప్రెసిడెంట్ వీవీ సుబ్బారావు డివిజనల్ సెక్రటరీ సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా నారాయణస్వామి ఎన్నికయ్యారు. నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎస్.రామచంద్రారెడ్డి, కార్యదర్శిగా యాచమనేని బాబురావు, ట్రెజరర్ కూనాటి ఈశ్వర్, జాయింట్ సెక్రటరీ ఈశ్వర్‌రెడ్డి, మహిళా ఏజెంట్స్ మహిళా ప్రెసిడెంట్‌గా కే మాధవి, సెక్రటరీగా పి.అమృత ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు నారాయణస్వామి మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడు నారాయణస్వామిని కమిటీ సభ్యులను సన్మానించారు.

సమస్య పరిష్కరించే దాకా ఆందోళన

- సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నింద్ర: రైతుల సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన ఆగదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని పాదిరి గ్రామం హైవే వద్ద రైతులతో కలసి ఆయన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హైవే కోసం రైతులు తమ పొలాలను విక్రయించారని, ఆ సమయంలో సర్వీసు రోడ్డు తమ పొలాలకు, గ్రామాలకు వెళ్లడానికి ఏర్పాటు చేసేందుకు హైవే అధికారులు ఒప్పుకున్నారని తెలిపారు. అయితే నేడు చిత్తూరు–తచ్చూరు నేషనల్ హైవే పూర్తయినా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోగా, రోడ్డుకు ఇరువైపులా ఫెన్సింగ్ వేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి రోడ్డుపైనే వంటావార్పు చేశారు. సమస్యపై చిత్తూరు ఎంపీ, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడగా.. వారు మంగళవారం వచ్చి హైవేను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు నారాయణ తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జనార్దన్, జిల్లా కార్యదర్శులు నాగరాజు, మురళి, ఏఐటీయూసీ నేతలు రామకృష్ణ, చంద్రయ్య, రామదాసు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఫ్యాషన్ షో

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణపై నేటి యువతరానికి అవగాహన కోసం విన్నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనర్, శిల్పారామం సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టింది. ఇందులో పెద్దఎత్తున యువతులు పాల్గొని వారే స్వయంగా డిజైన్ చేసిన వస్త్రధారులను ప్రదర్శించారు. నేటి ఆధునిక యుగంలో పూర్తిస్థాయిలో ఫ్యాషన్‌పై మక్కువ చూపి సంప్రదాయాన్ని మర్చిపోతున్న క్రమంలో యువతకు పాత సంప్రదాయాలను గుర్తు చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామని శిల్పారామం ఏఓ ఖాదర్‌వలీ తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేందర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సందీప్‌చౌదరి, జ్యోతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–14 రాష్ట్రస్థాయి జూడో పోటీలు ఆదివారం తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమయ్యాయి. రాష్ట్రస్థాయి జూడో పోటీలను డీఈఓ డాక్టర్ శేఖర్, డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్ ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. సోమవారం నాకౌట్ నిర్వహించి అందులో విజయం సాధించిన క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేయనున్నారు. కార్యక్రమంలో తిరుపతి, పుత్తూరు డీవైఈఓలు బాలాజీ, ప్రభాకర్‌రాజు, ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి జయరామయ్య, అండర్–14, 17 కార్యదర్శులు బాబు, జె.వసంతవాణి, ఎం.వసంత, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ మూడో విడత అడ్మిషన్లు

తిరుపతి సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మూడవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఉన్నత విద్యామండలి ఆదివారం సీట్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసింది. సీట్లు పొందిన విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలలో 25వ తేదీలోపు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం..

అలాగే మహిళా వర్సిటీ, ఎస్వీయూ పరిధిలో పీజీ సెట్–2024 రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు సోమవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. 26న ఆప్షన్ల మార్పుకు వెసులుబాటు కల్పించిన ఉన్నత విద్యామండలి, 28వ తేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియను పూర్తిచేయనున్నారు. సీట్లు సాధించిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఈనెల 30వ తేదీలోపు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

మర్యాదపూర్వక కలయిక



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో నూకతోటి రాజేష్, నేతలు

నాగలాపురం: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్, నాగలాపురం నేతలు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా తిరుపతిలో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండల అధ్యక్షుడు అపరంజిరాజు, రాష్ట్ర కార్మిక సంఘ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, ఎంపీపీ శ్యామ్, ఎంపీటీసీ సభ్యుడు రవి, భానుప్రకాష్ రెడ్డి, దేశప్పన్, భాస్కర్‌రాజు, ఆనందయ్య, ఏలుమలై, ఈశ్వరన్, కుబేరన్ పాల్గొన్నారు

టీడీపీ నేతల ఓవరాక్షన్.. ఆలయ రోడ్డు ధ్వంసం



రోడ్డును తవ్వుతున్న జేసీబీ



అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని రావిళ్లవారికండ్రిగ ఎరిక లింగేశ్వర స్వామి ఆలయ రోడ్డును స్థానిక టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఆలయానికి 22.44 ఎకరాల భూములు ఉన్నాయి. గత కొంతకాలంగా స్థానిక టీడీపీ నాయకులు, ఆలయానికి మధ్య భూవివాదంతో కోర్టులో కేసు నడుస్తోంది. మూడేళ్ల క్రితం భూముల్లో ఆలయం వరకు రోడ్డును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి భక్తులు రోడ్డు ద్వారా ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఆలయానికి వేసిన రోడ్డును జేసీబీతో తవ్వేశారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీని అడ్డుకుని తవ్వకుండా అక్కడి నుంచి పంపారు.

సాయం చేసేవాళ్లు దేవుడితో సమానం



దివ్యాంగులకు సరుకులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి : సాయం చేసే వారందరూ దేవుడితో సమానమని, అంతటి మహోన్నత వ్యక్తి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ అధినేత మునీర్ బాషా అంటూ డీఎస్పీ నరసింహమూర్తి కొనియాడారు. పట్టణంలో మునీర్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గత 153 నెలలుగా నిరంతరాయం సాగిస్తున్నారు. 154వ నెల ఈ సరుకుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ వంతుగా పేదలకు ఎంతో కొంత సాయం చేయాలని కోరారు. హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాల్లో తానూ పలుపంచుకుంటానని పేర్కొన్నారు. అనంతరం దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం డీఎస్పీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో షాకీర్ అలీ, న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికిపాటి రమేష్, కంత ఉదయ్, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు బాబా ఫరీద్, హరినాయుడు, ఢిల్లీకుమార్, షఫీ పాల్గొన్నారు.

పేరుకే హెచ్చరిక బోర్డులు

- అక్కడ అంతా అన్యాక్రాంతమే
- పెద్ద పాండూరు రెవెన్యూలో 4.26 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- గ్రామ సచివాలయానికి వెళ్లే దారి ఆక్రమిస్తున్న కబ్జాదారులు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు నాటుతున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని పెద్దపాండూరు గ్రామ రెవెన్యూలో ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ యంత్రాంగం మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తోంది. సర్వే నంబర్ 915లో 4.26 ఎకరాల ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ ఇటీవల మండల రెవెన్యూ యంత్రాంగం సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డులను పాతింది. గతంలో ఇదే భూమిలో 1.70 ఎకరాలకు నకిలీ పట్టాలను స్థానిక రెవెన్యూ అధికారులు జారీ చేయగా వాటిని రద్దు చేసినట్లు గతంలో పనిచేసిన తహసీల్దార్ తెలిపారు. అయితే హెచ్చరిక బోర్డులు పాతిన భూమిలో తాజాగా స్థానికంగా కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ భూమిలో గ్రామ సచివాలయాన్ని సైతం గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే సచివాలయానికి వెళ్లే దారిని సైతం దర్జాగా ఆక్రమిస్తూ ప్రభుత్వ నిబంధనలకు కబ్జాదారులు తూట్లు పొడుస్తున్నారు. అయితే ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.